క్లుప్తంగా

నేడు ఎంపీ బీబీపాటిల్ రాక

జహీరాబాద్: పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ సోమవారం జహీరాబాద్‌కు వస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరి తిరిగి ఎంపీ టికెట్‌ను దక్కించుకున్న అనంతరం మొదటి సారిగా జహీరాబాద్‌కు వస్తున్నారు. మధ్యాహ్నం 3గంటలకు జహీరాబాద్‌లో పర్యటించి మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని, అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

పాలక మండలి ప్రమాణ స్వీకారం

జహీరాబాద్: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి సోమవారం ప్రమాణ స్వీకారం నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు చైర్మన్‌గా నియమితుడైన ఎ.సాయిచరణ్‌తో పాటు 18మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని, అనంతరం మొదటి సమావేశం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ సమస్యలపై ప్రధానంగా చర్చించనున్నారు.

సీసీరోడ్ల పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న రసూల్ పటేల్

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా సీసీ రోడ్డు పనులను ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఆదివారం మండలంలోని మగ్దుంపల్లి, అల్లాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, విజయ్, శ్రీశైలం, వెంకటేశం, మొగులయ్య, మాణయ్య, నాగిశెట్టి, చాంద్‌పటేల్, శంకరయ్య, ఈశ్వరప్ప, వీరన్న, సునీల్, ప్రభుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా జరిగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడో రోజు ఆదివారం కల్యాణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షకార్యదర్శులు బెజుగం వేణుగోపాల్, నామ రవికిరణ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ



ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండలం బీబీపేట్‌లో బ్లాక్ లెవెల్ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆదివారం మహంకాళి యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మార్డి, కృష్ణాపూర్ జట్లు తలపడ్డాయి. కృష్ణాపూర్ జట్టు విజయం సాధించింది. సంఘం అధ్యక్షుడు కంత్రపల్లి చంద్రశేఖర్ విజేత జట్టుకు వాలీబాల్, నెట్, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ ఎన్నం అనిల్‌రెడ్డి, సభ్యులు విఠల్, రవి, గోపాల్, మహేందర్, అనిల్, నవీన్, పండరి, రాఘవగౌడ్, సతీశ్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు మహిళల నివాళి



నివాళులర్పిస్తున్న మహిళలు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండలంలోని కృష్ణాపూర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం మహిళలు సావిత్రిబాయి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల నాయకుడు బైండ్ల అశోక్, సాయిలు, ప్రకాశ్, రాములు, మహిళలు మరియమ్మ, సౌందర్య, ఇందిర, సమాధాన, సంధ్య, పవిత్ర పాల్గొన్నారు.

‘పది’లో శతశాతం టార్గెట్

- 18 నుంచి వచ్చేనెల 2 వరకు పరీక్షలు
- ప్రతి రోజు ప్రత్యేక తరగతులు
- పకడ్బందీగా ఏర్పాట్లు



స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. 40 రోజుల కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి రోజు ఒక సబెక్టు చొప్పున స్టడీ అవర్లు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల అనుమానాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై సబ్జెక్టు వారిగా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో జహీరాబాద్, హుగ్గెల్లి, చిరాగ్‌పల్లి, రంజోల్, మల్‌చెల్మ, సత్వార్, మొగుడంపల్లి, అసద్‌గంజ్, గడి 2బీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలకు చెందిన 3,010మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. రెండు మండలాలతో కలిపి ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఇన్విజిలేటర్ల నియామకంపై అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ వెంకటేశ్వర్లు మండల అధికారులను ఆదేశించారు. రెండు రోజుల క్రితం జహీరాబాద్ సందర్శించిన ఆయన పరీక్షల నిర్వహణపై సమీక్షించారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. పరీక్షల కోసం విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ప్రత్యేక తరగతులు తీసుకుంటూ టెస్టులు పెడుతున్నాం. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకుంటున్నాం .గత సంవత్సరం 98శాతం ఉత్తీర్ణ సాధించాం. ఈ సారి వందశాతం సాధించడం కోసం కృషిచేస్తున్నాం.

– బస్వరాజ్, ఎంఈఓ, జహీరాబాద్

భగీరథ నీరు వృథా

పైప్‌లైన్ లీకేజీతో ఇబ్బందులు



వృథాగా పోతున్న తాగునీరు

కంది(సంగారెడ్డి): మిషన్ భగీరథ పైప్ లైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని కాశిపూర్ నుంచి ఇంద్రకరణ్, జుల్కల్, ఎద్దుమైలారం తదితర గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు బెంగళూరు బైపాస్ రోడ్డు మీదుగా పెద్ద పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. కాశీపూర్ శివారులో రోడ్డుపై సుమారు నెలరోజుల నుంచి పైప్ లైన్ లీకేజీ కావడంతో తాగునీరంతా వృథాగా పోతోంది. ప్రస్తుతం రోడ్డుపై పెద్దగా గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. అయితే అధికారులు మాత్రం గుంతవద్ద ఓ ఎర్ర జెండాను పెట్టి వదిలేశారు. ప్రమాదాలు జరగక ముందే పైప్ లైన్ లీకేజీకి మరమ్మతులు చేయించి గుంతను పూడ్చాలని వాహనాదారులు కోరుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఎస్‌ఈ రఘువీర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా పైప్‌లైన్ లీకేజీతో రోడ్డుపై గుంత ఏర్పడిన మాట వాస్తవమేనన్నారు. అయితే అక్కడ మరమ్మతులు చేపట్టాలంటే సంగారెడ్డి, సదాశివపేట పట్టణాలతో పాటు పలు గ్రామాలకు నీటిసరఫరా నిలిపి వేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం వేసవి ఉన్నందున నిపుణులతో చర్చించి త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ పండుగను పురస్కరించుకొని రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. 30 రోజుల పాటు కఠినమైన నిబంధనలతో ఉపవాసం ఉంటూ ప్రతిక్షణం దైవ చింతనలో ఉండడం రంజాన్ మాసం గొప్పతనం అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఆదర్శ్‌రెడ్డి, నగేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాండు, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, మెరాజ్ ఖాన్, షకీల్, మైనార్టీ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర చిత్రపటానికి క్షీరాభిషేకం



మంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లికి 30 పడకల ఆసుపత్రి మంజూరు చేసి, భూమిపూజ చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఆదివారం మండల అధ్యక్షుడు రమేశ్‌జోషి మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా వట్‌పల్లిలో ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడంపై ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎన్నికలకు ముందు మంత్రి ఇచ్చిన హామీని వంద రోజుల్లోనే నెరవేర్చడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్రి అపర్ణ, మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, శ్రీశైలం, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వెంకటరావు పాటిల్, శంకర్, కచూర్‌రావు, ఎన్‌ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం: జిన్నారంలోని తాబేలు గుట్టపై నిర్మాణంలో ఉన్న జ్యోతిర్లింగ శివాలయ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన సైదులు ఆదివారం రూ.10వేల విరాళాన్ని అందజేశారు. దేవాలయ నిర్మాణానికి తనవంతు సాయంగా అందజేశానని చెప్పారు. కార్యక్రమంలో దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

జిన్నారం: మండలంలోని ఊట్ల గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఆదివారం కూడా ఘనంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని వైభవంగా చేశారు.

దొంగతనం కేసులో యువకుల అరెస్టు

కోహీర్(జహీరాబాద్): మండలంలోని కవేలి క్రాస్‌రోడ్డు వద్ద పాన్‌షాప్‌లో దొంగతనానికి ప్రత్నించిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. నిందితులు అర్షద్, సూరజ్ కుమార్, ఫర్దీన్ సదాశివపేట నివాసులు. శనివారం రాత్రి 2గంటల ప్రాంతంలో కవేలి క్రాస్ రోడ్డు వద్ద పాన్ షాప్ తలుపు తెరిచే ప్రయత్నం చేస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. పాన్‌షాప్ యజమాని సయ్యద్ సామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

వ్యక్తి అదృశ్యం



మహేశ్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం.. రామచంద్రపురం పరిధిలోని వెలిమెలకు చెందిన చాకలి మహేశ్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్తున్నాను అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేసి చూడగా ఫోన్ ఇంట్లోనే వదిలి వెళ్ళాడు. మహేశ్ కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. మహేశ్ సోదరుడు చాకలి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: సాయిరాం నగర్ కాలనీలో ఆదివారం హరేరామ హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన రహదారి నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన కమ్యూనిటీ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సంస్థ వక్తలు భగవద్గీత, మాయణాల ప్రాముఖ్యత గురించి వివరించారు.

వీరభద్రేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



క్యూ లైన్‌లో భక్తులు

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయం అమావాస్య సందర్భంగా ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పాండురంగ విఠలేశ్వర రుక్మాబాయికి పూజలు

మునిపల్లి(అందోల్): జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర రుక్మాబాయి దేవతా మూర్తులకు సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమావాస్య సందర్భంగా జరిగిన కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఉపాధ్యాయుడికి జై భారత్ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న రామకృష్ణ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్(కె) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టర్ పోట్రు రామకృష్ణ జాతీయ స్థాయి జై భారత్ పురస్కారంతోపాటు ఉపాధ్యాయ రత్న బిరుదు అందుకున్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఫిల్మ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత దూడపాక శ్రీధర్ పురస్కారంతో పాటు స్వర్ణ కంకణంతో సత్కరించారు. ఆయన విద్య, సామాజిక సేవా రంగాలలో చేసిన విశేష కృషిని గుర్తించి ఆర్యాని సకల కళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళాసేవా సంస్థ ఈ అవార్డుకు ఎంపికచేసి అందజేశారు. రామకృష్ణను నిజాంపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస రెడ్డి, మండల విద్యాధికారి అంజయ్య, నోడల్ అధికారి రుద్రప్ప, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, హెచ్‌ఎంలు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వేణుగోపాలరావు, రవిబాబు, వీవీ రెడ్డి, మణి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సంగారెడ్డి: మాట్లాడుతున్న బీబీ పాటిల్

ఎంపీ బీబీ పాటిల్

సంగారెడ్డి: వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో స్థానిక పీఎస్‌ఆర్ గార్డెన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ దంపతులు, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీర శైవ సమాజం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించుకోవడం చాలా అదృష్టకరం అని ఎంపీ అన్నారు. సమాజం జిల్లా అధ్యక్షుడు ప్రసాది మధుశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 4వేల మంది మహిళలు పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మంజుల, ముద్ద శశికళ, గొర్రెగట్టు శారద, పట్లోళ్ల అరుణ శివరాజ్, కరుణ రాజేశ్వర్, పట్లోళ్ల శివరాజ్ పటేల్, నవీన్ శివచంద్రకుమార్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శంగా నిలవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత ఆకాంక్షించారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, మెప్మా ఆర్‌పీలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు అనేకరంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెంది పదిమందికీ ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం పారిశుద్ధ్యం సిబ్బందికి దుస్తులు, కొబ్బరి నూనె, సబ్బులు, బెల్లం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్‌లు మంజుల, సరిత, చిట్టి, శ్రీశైలం, శంషాబాద్ రాజు పాల్గొన్నారు.

జ్యోతినగర్ కాలనీలో..

స్థానిక జ్యోతినగర్‌కాలనీలో డ్వాక్రా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



సుధను సన్మానిస్తున్న మహిళలు



దుస్తులు పంపిణీ చేస్తున్న లలిత తదితరులు

గిరిజన అభ్యర్థులకు సన్మానం



ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో టీబెస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: ఉద్యోగాలు సాధించిన జహీరాబాద్ ప్రాంత గిరిజన అభ్యర్థులను తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సేడిగుట్ట తండాకు చెందిన రవీందర్ బాణోత్, చంద్రకళ, గౌసాబాద్ తండాకు చెందిన ధనుబాయి, లచ్చనాయక్ తండాకు చెందిన జైపాల్ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. లచ్చనాయక్ తండాకు చెందిన లలిత స్టాఫ్ నర్సుగా, మధులై తండాకు చెందిన సునీల్, సేడియా గుట్ట తండాకు చెందిన జ్యోతి నర్సింగ్ స్టాఫ్‌గా, లచ్చనాయక్ తండాకు చెందిన సుధారాణి జేఎల్‌గా ఉద్యోగం సాధించారు. పట్టణంలోని బంజారా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్ అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ చవాన్, పవార్ శ్రీనివాస్ నాయక్, రఘునాథ్, రాంసింగ్, సర్వార్ లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం



సమావేశమైన కార్యవర్గం

ఝరాసంగం(జహీరాబాద్): భారతీయ జనతా పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శులుగా చిప్పే బస్వారాజ్, గోపాల్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడుగా పడమటి శ్రీనివాస్, యాదవ రెడ్డి, బత్తిని పాండు, డప్పూర్ ప్రశాంత్ కార్యదర్శులుగా అనిల్ పాటిల్, రవి యాదవ్, బోయిని రమేశ్, బంటు అశోక్, గొల్ల నర్సింహులు, విశ్వనాథ్, కోశాధికారి తమ్మాలి మహేశ్, యువ మోర్చా మండల అధ్యక్షుడు వినోద్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కోట వెంకటేశం, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు బానోత్ గణేశ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు పెద్దలోడి రమేశ్‌ను ఎన్నుకున్నారు.